

# లేడి చంపిన పులి నెత్తురు

ఎన్.వి. కృష్ణాజీ

‘ఏటింత బేగే సీతకాల మొచ్చేసిందేటి,’ అంటూ బండ మీద తలపెట్టి కునుకు తీస్తున్న దుబ్బుదొర చివాలున లేచి కూర్చున్నాడు.

‘పట్టపొగలు. వెన్ను చురుకే ఎండ నల్లటి వీపు మీద పడుతుంటే సెవానుగా కునుకట్టింది. మరీ సలి గోలేటి? గాలిలో నీటోసన... సల్లటి నీటోసన. తూనీగలు గిరికీలు కొడుతున్నాయి. ఏటైపోనాదెండి లాటి ఎండంతా? సూరీడు మబ్బు మరుగైపోనాడేటి?’ దిగ్గున లేచాడు దుబ్బుదొర. పిట్టల కూతలు. పోతున్నాయి సెట్ల మీకి. వోనొస్తంది. బండ మీద నుండి వేణువు తీసి పెదాలకి చేర్చాడు. నిమషం వాయించే సరికి మే, మే అంటూ మేకలు చేరాయి. గుంపంతా చేరిందా లేదా అని ఆ చివరి నుంచి ఈ చివర వరకూ తడిమి చూశాడు. ప్రతి మేకలోని ప్రత్యేకత తెలుసు వాడికి.

కొండ దిగడానికి సానా సమయమౌద్ది. జో, జో అంటూ కొండవాలు నుంచి పరుగు లంకించుకున్నాడు. మరెవరికయినా ఆ కొండ వాలున నడవడం కూడా కష్టమే. కాని దుబ్బుదొరకది తల్లి చన్ను కుడుస్తున్నప్పుడే నేర్చుకున్న ఇద్దె. కోసుగా ఉన్న రాళ్లు. తప్పటడుగు పడితే రసాతలంలాంటి లోయలోకి పడక తప్పదు. తీగ మీద నడిచే సర్కసు ఆటగానిలా చాలా సునాయాసంగా పరుగెడుతున్నాడు దుబ్బుదొర. గానుగాకు వాసన... ఇక్కడ పెద్ద ముళ్లకంచుంది. చేతిలోని ముల్లుకర్రతో కంచెను తొలగించాడు పరుగెడుతూనే. వాడి వెనక 98 మేకలు వాడితో సమానంగా పరుగెడుతున్నాయి.

‘సినుకడ్డదా... మేకలకి సిడుమొచ్చేద్ది. ఓన రాక మున్నే కింద సింతతోపు సేరిపోవాల,’ అనుకొని వేగం ఇంకా పెంచాడు. కాళ్లలో చిన్న రాళ్లు గుచ్చుకుంటున్నాయి. అంటే ఇంకో కోసు దిగాల. కేకలు పెడుతున్నాడు మేకలకి ఉషారుగా. ఆ బండల మీంచి, రాళ్ల మీంచి, ముళ్లడొంకలలోంచి వేగం తగ్గకుండా అదే పరుగు. ఆ... కుడుము వోసన వచ్చేసింది. మలుపు తిరగాల. నిండా అడుగు వెడల్పుంటుంది. బండ నానుకున్న ఆ దారి. ఆ మలుపులో కూడా వాడు పరుగెడుతూనే ఉన్నాడు. మలుపు తిరగడానికి మేకలు మందగించాయి. వాటి కోసం తనూ కాస్త మందగించాడు... అదో కుంటిమేక కూడా మలుపు తిరిగింది... రొప్పుతోంది అలిసిపోయి. ఇక్కడే చిన్న వాగు. నేల జారుద్ది. మెత్తటి మన్ను. యిరవై అంగల వరకూ... అదిలించాడు వెనకాల మందని. వాగు బారెడు వెడల్పుంటుంది. దూకాలా బారెడు దూరమూ. తూనీగల రొద ఎక్కువైపోనాది. ఏ సిటంలోనైనా సినుకు పడిపోద్ది. కొంచెం వేగం పెంచాడు వెనక్కి తిరిగి మందకి ఉషారిస్తూ.

దారి కోసుగా కిందకి దిగుతుందక్కడ. పాదాలకి ఇసుక తగులుతూంది. ఎంతో దూరం లేదు సింత తోపు... అదో జొన్న పైరు వోసన. పైడితల్లి మావ పొలం. ఆ పొలం వాడు పరుగు తీస్తున్న దారికి ఫర్లాంగు దూరం పైగా ఉంటుంది. ఏనుక్కంటే, జాగిలం కంటే బలమైంది వాడి వాసన. సింత తోపులోకి చేరగానే పక్షుల కిలకిల. గుండె ఝల్లుమనే ఉరుములు... ఇక రానీ వోన... తనకేటి... మందంతా సేరిపోనాది తోపులోకి. వోన తగ్గంగానే గూడెం సేరుకోవచ్చు. ఆ ఎంత. రెండు కోసులు. సింతసెట్టు మొదలు దగ్గర చతికిలపడ్డాడు.

దుబ్బుదొరకి 13 ఏళ్లంటే నమ్మడం చాలా కష్టం. చాలా ఏపుగా ఉంటాడు మూతి నున్నగా ఉన్నా. ఇప్ప

గూడెం నాయకుడు కొండదొరకి వాడు మూడో కొడుకు. అన్నలిద్దరూ తండ్రితో పోడు వ్యవసాయం చేస్తారు. తండ్రి వాడికే మేకల మందనప్పగించాడు. వాడు పుట్టంగానే వాడికీ తల్లికీ అమ్మవారు వచ్చింది ఉధృతంగా. కొండదొర అమ్మోరుకి ఏట ఏసినా తల్లీ బిడ్డ బతికి బయటపడినా దుబ్బుదొరకి రెండు కళ్లూ పోయినాయి.

వాడి వాలకం చూస్తే వాడికి చూపులేదని ఎవరూ అనుకోరు. గూడెంలోని ప్రతి గుడిసె, ప్రతి చెట్టు, ప్రతి పుట్ట వాడికి తెలిసినంతగా మరెవరికీ తెలీదేమో. ఎక్కడ రాయుందో, ఎక్కడ రప్పుందో, ఎక్కడ పాదాల కింద ఇసక తగులుతుందో, ఎక్కడ నేల జారుతుందో వాడికి బాగా తెలుసు. మేకల మందతో పొద్దున్నే బయలుదేరి నాలుగు కోసుల దూరంలో ఉన్న కొండ ఎక్కుతాడు. పొద్దుగూకకుండా గూడెం చేరుతాడు మందతో. మందలో ఒక్క మేక కూడా తప్పదు. వాడు మురళి వాయించగానే మందంతా వాడి చుట్టూ చేరుతుంది. జో... జా... అంటాడు. వాడి భాష మేకలకి తెలుసు. మే... మేల లోని వ్యత్యాసం వాడికి తెలుసు. గూడెంలో అందరూ వాడ్ని చూసి 'పాపం' అంటారు. అదే వాడికి చాలా కోపం తెప్పిస్తుంది.

''కల్లు నేకపోతే ఏటైపోనాది,'' అంటాడు.

వాసనతో చెపుతాడు వాడు పురుగొచ్చిందో, ఎలుగొచ్చిందో. శబ్దంలోని అర్థాలు వాడికి చాలా సుళువుగా అర్థమవుతాయి. గాలిలోని మార్పులని కనిపెట్టడంలో వాడు మహా మేధావి. ఎండాకాలంలో గాలి, వాన వొచ్చే ముందు గాలి, రొదగాలి, చలిగాలి- అన్నిటికీ మధ్యనున్న వ్యత్యాసం వాడికి బాగా తెలుసు. వాగులో స్నానం చేస్తూ వాడు వరదొస్తూందని చెప్పాడొకసారి. గబగబ ఒడ్డుకొచ్చేశాడు. వాగులో ఈత కొడుతున్న అన్నని హెచ్చరించాడు. కాని అన్న నవ్వాడు.

''వోరం రోజులుగా వానేనేదు, వరదేట్రా గుడ్డెదవా,'' అన్నాడు.

ప్రవాహం రానే వచ్చింది. ఆ నీటిచప్పుడు కోసెడు దూరంలో ఉండగానే పసిగట్టాడు వాడు. గబగబ వాగు అంచున పరుగు లంకించుకున్నాడు. వాగువాలులో ఉన్న మర్రిచెట్టును కోతి కంటే వేగంగా ఎక్కాడు. ఎక్కి ఊడల్ని విసిరాడు వాగులోకి. ''అన్నో... అట్టుకో... ఊడట్టుకో,'' అనే వాడి పొలికేకలు ఆఖరిక్షణంలో అన్నకి వినిపించాయి. ప్రవాహంలో రెండు ఫర్లాంగులు పైగా కొట్టుకొచ్చిన వాడికి ఊడందింది. దాని సాయంతో బైటపడ్డాడు ప్రాణాలతో.

మట్టి వాసన. దానిలో తేడాలు. దారిలోని పేడ ఆవుదా, ఎద్దుదా అన్నది కూడా వాడు సునాయాసంగా చెప్పగలడు... నేలమీద చెవిపెట్టి. నడక, నడకలోన శబ్దం బట్టి వాడు వచ్చిన మనిషిని గుర్తుపడతాడు. వాడి తల్లి కాళ్ల కడియాల చప్పుడు వాడికి చాలా ఇష్టమైన శబ్దం. గూడెంలో బడికెళ్లి చదివిన వాళ్లెవరూ లేరు. దుబ్బుదొరకసలు కళ్లే లేవు. ఇక చదువేమిటి?

పశువుల గిట్టలశబ్దం, పక్షుల రెక్కల చప్పుడూ వాడికి సంగీతం. వింటూ తన్మయత్వం చెంది పోతాడు.

''పైడితల్లి మావో! మీ గేద ఎనకాల ఎడంకాలు గుంజుతూ నడుత్తూంది. ఏటైనాదో సూడు మావో,'' అంటే పైడితల్లికి నవ్వాగలేదు.

''ఏట్రా. అది దున్న కాదు గేదె. బండి నాగదు. ఎరక దున్నదు. దాని కాలెందుకు గుంజుద్ది. ఒల్లకో,'' అని వేళాకోళం చేశాడు.

రెండోరోజు పైడితల్లి గేదె లేవలేకపోయింది. వాతం వచ్చి పడిపోయింది.

గూడెంలో రోజూ రాత్రి కోళ్లు మాయం కాసాగాయి. నక్కలెత్తుకు పోతున్నాయనుకున్నారు. కొండదొర ఇంట్లో కూడా పెట్టపోయిందో రాత్రి. పాదాలతో నేలని తాకుతూనే చెప్పాడు దుబ్బుదొర.

''అయ్యో! రేతిరొచ్చేది నక్క కాదు, తోడేలు. కొండమీన మంద మేస్తుంటే ఓ పాలొచ్చినాది. దాని గోళ్ల గురుతులివే,'' అని చెప్పాడు వాడు.

మూడు రాత్రులు మాటేసి తోడేలుని చంపేశారు.

''కళ్లుంటే ఈడు మంచి సికారీ అయుండేవాడు,'' అని గూడెంలో వాళ్లు అనుకున్నారు.

గూడెం చుట్టూ అడవి. అడవిలో నక్కలూ, తోడేళ్లూ, అడవి పందులూ తప్ప క్రూరమృగాలేవీ లేనట్టే. రెండేళ్ల క్రితం గూడానికి ఆరు కోసుల దూరంలో చిరుతని చూశారట.

''ఈ కానలో ముగమే కరువైపోనాదే,'' అని వాపోతాడు కొండదొర.

తన చిన్నతనంలో కానలో ముగాలు గూడెంలో చీమల్లా తిరిగేవట. ఎంత సిక్కగా ఉండేది మన్నెం. నడవటానికి ఓ పట్టాన దారి దొరికేనా. పట్టపగలే సిమ్మసీకటి. సెవులు సిల్లులు పడేలా కీసురాళ్ల రొద. శివాచారి జుత్తులా యిరగబోసుకున్న మర్రూడలు. అసిరొమ్మ జడలా నల్లటి తాచు పాములు. జింకలు, కడుసులు, దుప్పులు, సిరుతలు, పులులు అన్నీ అలింగం తిరిగేవి కానంతా.

''పట్నపోళ్ల కళ్లు మన్నెం మీదొడ్డాయి. సెట్లు కొట్టేశారు. కొండలు పిండి చేశారు. మన్నెం పలుసబడిపోనాది. జింకలకే తిండినేదు- యిక ముగాల కేటుంటాది. మా తాతలనాడు పట్నపోళ్లకి మన్నెం

నుంచి అడ్డాకులు, కుంకుళ్లు, పట్టుతేనె కావలిసొచ్చేవి. పోనుపోను మన్నెంలోని ఇప్పసారా, జిల్లేడు కల్లు ఇంకా ఇక్కడి పిట్టలు కూడా కావలసొచ్చాయి. ఆళ్ల తొత్తుల్ని పిలిసి గంజాయి పెంచారు. నంజ కొడుకులు - మన్నెం రూపే మారిపోనాది. కాన కెలికి వెతికినా ముగమే కానరాదే,'' అంటూ ముందు కాలం వారు వాపోతారు.

గూడెంలో ఆరోజు చీకటింకా పోకుండానే కల కలం మొదలయింది. ఒక ఆవుదూడ కనబడలేదు. వెతగ్గా కోసు దూరంలో సగం తిని వదిలేసిన దూడ కాలు కనిపించింది. తోడేలో, దుమ్మలగుండో అయుం టుందని తీర్మానించింది గూడెం. మర్నాడు మరో గుడిసె ముందు కట్టిన గేదెదూడ కనిపించలేదు. ఆ మరునాడు ఒక ఆవే కనిపించలేదు. ప్రతిరోజూ ఇది మామూలైపోయింది. రాత్రి గూడెంలో కాగడాలతో పహరా మొదలయింది. గూడానికి ఉత్తరాన పహరా కాస్తున్న గంగులు మాయమైనాడు. సగానికి పైగా తిని పడేసిన వాడి శరీరం చింతతోపు దగ్గర దొరికింది.

గూడెం మీదకి ప్రతి రాత్రి వస్తున్నది తోడేలూ కాదు, దుమ్మలగుండూ కాదు. ఇది పులే అయుండాలి. మనిషి రక్తం మరిగిందంటే ఇది ముసల్దో, దెబ్బతిన్నదో అయుండాలి. మరో ముగ్గురికి గంగులు గతి పట్టడంతో ఫారెస్టు రేంజరుకి, ఐ.టి.డి.ఎ ప్రాజెక్టాఫీసరుకి కబురు చేరింది. అతి కష్టం మీద జీపు గూడెం చేరుకుంది. పి.ఓ అక్కడ వేసిన డేరాలో కాంపు వేశారు. గూడెం నాలుగు దిక్కులా రాత్రిళ్లు నెగడు వెయ్యడం మొదలయింది. తుపాకులతో రాత్రి పహరా మొదలయింది. ఇదిలా జరుగుతూండగానే మన్నెంలో కట్టెలకో, ఆకులకో పోయే మరో ముగ్గురు పులివాత పడ్డారు. దుబ్బుదొరని కొండపై లోయలోనికి పోనియ్యలేదు. మేకలమందతో సింతతోపు వరకూ వెళ్లి ఎండుండగానే గూడు చేరేవాడు. పొద్దెక్కినాకనే బయలుదేరేవాడు కూడా.

'ఎన్నావులు- ఎన్ని గేదలు- మరెన్ని దూడలు- ఎంతమంది మడుసులు- తినేసినాదా ముగం. కానలో ఏటాడకుండా గూడెం మీనకి రాడమేటి? సిత్రం. దానికి కానలో కూడే దొరకనేదా? అసలీ ముగం వోసనెట్టా ఉంటది? బూమ్మీద తను కాలెట్టిన కాడ నుంచి ముగం వోసనే ఎరికనేదు. కానలో ముగమే నేదంటాడయ్య. మరేడదిది? సుక్కల్లోంచి ఊడొడ్డదా! కొత్తమాసకి అమ్మోరి సంబడం సబబుగా సెయ్యాల. ఇదమ్మోరి శాపం. మగమ్మోరి కాకపోతే ముగమొచ్చింది గూడెం మీకి.'

చింతచెట్టు నానుక్కూర్చున్న దుబ్బుదొర బుర్రలో పులి తిరుగుతూంది. అది గాండ్రుమంటుందని విన్నాడుగాని వాడింతవరకూ ఆ శబ్దాన్ని వినలేదు. బొడ్డులో పదిలంగా దోచుకున్న పుగాకుముక్క నములుత్తా లేచాడు. కొండవేపు తల తిప్పాడు. ఆ కొండ తనది. ఆ కొండమీకి తనెళ్లి యియ్యాల్టికి పండెండు దినా లైంది.

మెత్తటి నేలలో నడుస్తున్న దుబ్బుదొర పాదాలకి మేకల గిట్టల గురుతులూ, బండిచక్రం జాడలూ, మడుసుల కాలి గురుతులూ, జీపుచక్రం జాడలూ తగులుతున్నాయి. కదలుతున్న వాడి పాదాలు మళ్లీ మళ్లీ వెతుకుతున్నాయి మెత్తటినేలలోని గుర్తుని. వాడి కెప్పుడూ తారసపడని గుర్తది. కిందికి వంగి చేతుల్తో తడుముతున్నాడు. ముందుకీ, వెనక్కీ, కుడివైపుకీ, ఎడంవైపుకీ మళ్లీ తిరిగి తిరిగి ఆ జాడల్ని చేతివేళ్లతో, కాలివేళ్లతో తాకితాకి చూశాడు. వాడి ముఖం విప్పారింది.

'ఇదే ఆ మగమ్మోరి. ఈ తెన్నునే కొండెక్కినాది,' అనుకుంటూ ముప్పై అంగలు ఆ జాడల్ని వెంబడించాడు.

ముంగిట కుడికాలుకి మజ్జేలు నేదు దీనికి. ముంగిట పంజా పడిన సోటుకి, ఎనక పంజా పడిన సోటుకీ అయిదు మూరల జానెడు దూరం బెత్తెడుంది. ఆ గుర్తులు తాకి, తడిమి ముప్పై, నలబై అంగలు ముందుకూ, వెనక్కీ పరుగెడుతూ పరిశోధించాడు.

వాడికా గుర్తులు భూతద్దంలో శాస్త్రకారుడు చూసినట్టుగా స్పష్టంగా, నిర్దిష్టంగా కనిపిస్తున్నాయి. గుర్తుపడ్డ చోట ఆ గుర్తులు ఎంత లోతున్నాయో చేతి వేళ్లు పెట్టి నాలుగైదుసార్లు కొలిచాడు. అంటే ఆ ముగం వాడి అయ్య మోసిన కట్టెల కావిడి కంటే బరువుగా ఉంటుంది. వాడి ముఖం అనిర్వచనీయమైన ఆనందంతో విప్పారింది. బ్రతుకులో సరికొత్త విషయం నేర్చుకున్న సమయమిది. పరుగున తను చతికిలబడ్డ చింత చెట్టు చేరి దాని మొదలు దగ్గర పెట్టిన వేణువు తీశాడు. ఊదగానే మందంతా వాడి చుట్టూ చేరింది. మేకల్ని తడిమి చూశాడు. వాటి మే, మేలను జాగ్రత్తగా వింటూ... జో, జా అంటూ గూడెంవైపు దౌడు తీయ సాగాడు. ఎండింకా వేడిగా ఉంది. వీడి హడావిడి ఏమిటో అర్థంకాని మేకలు వెనకాల పరిగెడుతున్నాయి. తన గుడిసె చేరాడు. మేకలన్నీ కంచెలోకి రాగానే మళ్లీ మళ్లీ లెక్క చూసి కంచెను రాటకు తాడుతో బిగించాడు. గుడిసెలో ఎవరూ లేరు- మళ్లీ పరుగు- ప్రాజెక్టాఫీసరు కాంపు వేసిన డేరా వైపు.

''దొరా! ముగం కానొచ్చింది. ముగం కొండ మీనుంది. రా దొరా. నే సూపుతా,'' ఒగరుస్తూ డేరా దగ్గర నుంచున్నాడు దుబ్బుదొర.

"నీ సెయ్యే నీకు కానరాదు. ముగం నీకు కానొచ్చిందిరా గుడ్డి నంజకొడుకా."

అది మల్లుదొర గొంతు. తన తాతా ఆడూ కానలో నెలికేవారట ముగాల జాడల కోసం.

డేరా ముందర రేంజరుతో మాట్లాడుతున్న పి.ఓ మల్లుదొర నడిగాడు-

"ఎవరితను?"

"ఆడు కొండదొర మూడో కూన- కల్లు నేవు- కబోది."

"ఆడు ముగాన్ని సూశాడా."

"అవు దొర. నే సూబుతా ముగాన్ని. అది రెండు బారలుంటుంది. మా అయ్య మోసే కట్టెల కావిడి కన్న బరువుంటది. దానికి ముందు పంజా మద్దేలు నేదు."

"అలాగా," అంటూ పి.ఓ వాడి దగ్గర చేరాడు వాడ్ని విస్మయంతో చూస్తూ.

"ఆడినొగ్గీ దొరా ఆడికి సూపే నేదు," మధ్యలో మల్లు.

"కాద్దొరా. అమ్మోరి మీదాన. ఒక్క పాలి నా మాటిను. నే సూపుతా ముగాన్ని. నగెత్తు నా ఎనకాల," అంటూ చింతతోపు వైపు పరుగు లంకించాడు.

ప్రాజెక్టాఫీసరు ఐ.ఎ.ఎస్ పూర్తిచేసిన వెంటనే ఇక్కడికి పోస్టింగు వచ్చింది. పట్నవాసం. కాన్వెంటు చదువు. ఎ.సి కార్లలో తిరిగిన ఆయనకీ ఉద్యోగం చాలా ఇబ్బందిగా ఉండేది మొదట్లో. కాని తాను చదివిన అనేక వేల పుస్తకాలలో లేని విషయాలు కనిపించాయి ఈ కానలో. జీపు పోలేని చోట ఆయన కాలినడకన నాలుగైదు మైళ్లు నడిచిన ఘట్టాలు కూడా వున్నాయి. అన్నెం పున్నెం తెలియని ఈ ఆటవికులకు ప్రభుత్వం తలపెట్టిన ఉపాధిని వారికి అందించాలనే చిత్తశుద్ధి ఉన్న అధికారి అతను. ఆరు నెలలయిందీ ఉద్యోగంలో చేరి. ఈ అడవిలో ఎక్కడేముందో, ఏం జరుగుతోందో, ఏఏ మనుషులెటువంటివారో మొత్తం అంచనా వేశాడాయన. కాని ఈ కొండదొర మూడో కొడుకు- గుడ్డివాడా- తనకింత వరకూ తారసపడలేదు. కాని వాడి గొంతులోని కన్విక్షన్ ఆయన్ని ఆకర్షించింది. భూమి ఆకర్షించిన న్యూటన్ చూసిన ఆపిల్‌పండులాగ.

దుబ్బుదొర వెనక పరుగు తీశాడాయన. ఆర్డర్లీని గన్‌తో రమ్మని సైగ చేస్తూ. ముందు దుబ్బుదొర, వెనకాతల పి.ఓ., వెనక ఆర్డర్లీ, రేంజరు, గార్డు, మల్లుదొర, పనికి పోలేక గూడెంలో మిగిలిపోయిన ముసలీ ముతకా.

తన వెంటన్ సిరి... లచ్చి వెంటన్... లాగుంది పరుగెడుతూన్న వారి బారు. ఈ కోలాహలానికి చుట్టుప్రక్కల పొలాల్లో, తోపుల్లో పనిచేసేవాళ్లు కూడా చేరారీ సంబరంలో. దాదాపు మొత్తం గూడెం అంతా అక్కడికి చేరుకుంది. ముగం కానొచ్చిందని కొందరూ దాని తోక బారెడుందని కొందరూ, దాన్ని దొర కాల్చి చంపాడని మరికొందరూ - రకరకాలుగా చెప్పుకుంటూ చింతతోపు చేరారు.

"ఆగండక్కడ! ఇటెవ్వరూ నావద్దు. ముగం గురుతులు సెదురుతాయి," గర్జించాడు దుబ్బుదొర.

యుద్ధంలో కమాండర్ జారీ చేసిన ఆర్డర్‌లా వినిపించిందా గొంతు పి.ఓకి. ముందుకు నడుస్తున్న తనూ ఆగిపోయాడు వాడి లీడర్‌షిప్పు క్వాలిటీని లోలోనే మెచ్చుకుంటూ.

"నువ్వు రా దొరా. సూడిది దాని పాదం. ఇది ఎనక ఎడంకాలు- ఇల్లిదో- ఎనక కుడికాలు... ఇది గిదిగో సూసినావా ముందు కాలు- మద్దెలో రెండు బారల బెత్తెడు. ఇదో ఇది సూడు... కుడికాలు... ఇదో ఇది ఎడంకాలు... ఇలా ఇలా నడిసినాదా మగమ్మోరి... సూసినావా దాని గురుతులు," అంటూ ముప్పయి అంగలు పరుగుపెట్టి- "ఇక గురుతులు కానరావు. బూమ్మీద మన్నుపోయి రాయొచ్చినాది. ఆ ముగం కొండెక్కినాది," అంటూ కొండవేపు తల తిప్పాడు.

వాడి వెనకే నడుస్తూ, వాడి అడుగులో అడుగేస్తూ, వాడి చూపులేని కళ్లు చూసిన దారిలోని గుర్తులను గమనిస్తున్న ప్రాజెక్టాఫీసరుకి మతిపోయింది- ఆ హడావిడి- ఆ ఆవేశం- ఆ నాయకత్వ లక్షణాలు- 'మైగాడ్- హి ఈజ్ ఎ బార్న్ లీడర్,' అనుకున్నాడాయన.

ఆయన పులిగుర్తులెప్పుడూ సూడలేదు. కాని వాడు చూపెడుతున్న గుర్తులు పులివేనని ఆయనకి పూర్తి నమ్మకం కలిగింది- ఆ గొంతులోని కన్విక్షన్- ఆ ఎనాలిసిస్- ఆ కన్‌క్లూషన్లో డెఫినిట్‌నెస్- ఓహ్ వీడికి బ్రష్‌నిస్తే పులిబొమ్మనే గీసేస్తాడు. యూనివర్శిటీలో ప్రొఫెసర్ ఒక క్లిష్టమైన విషయాన్ని తార్కికంగా విడదీసి చెప్పేటప్పుడు తనకి ఎటువంటి ఎడ్మిరేషన్ కలిగిందో ఈ అడవిలోని గుడ్డిపిల్లాడు చెపుతూన్నప్పుడు కూడా సరిగ్గా అదే అనుభూతి కలిగింది. విప్పారిన కనులతో, నోటమాట రాని విస్మయంతో అచేతనంగా దుబ్బుదొర వెనక నుంచున్నాడాయన దూరంగా.

"దొరా! గురుతులు ముగానికి మల్లేనే వున్నాయి," అన్నాడు మల్లు.

''మల్లేనే కాదు మల్లూ. ఇవి కచ్చితంగా పులి పాదాల గురుతులే. ఈ గుడ్డి కూనకీ మన్నెంలో తెలీని గడ్డిపోచ కూడా లేదు,'' పి.ఓ బదులిచ్చాడు.

''దొరో! ఈడ కానొచ్చాయి మల్లీ ముగం గురుతులు- రా దొరా,'' అంటూ పొలికేక పెట్టాడు దుబ్బుదొర. ఆ కేక దిక్కుగా చూశాడు పి.ఓ. వాడు వంద అడుగుల ఎత్తున ఉన్నాడు. పైకెక్కడం ప్రారంభించాడాయన. నున్నటిరాయి మీద కాలు జారుతూంది. అడుగులో అడుగేసుకుంటూ పైకెక్కుతూన్న ఆయనకి పైన దుబ్బుదొర చేస్తున్న హడావిడి వినిపిస్తూంది. ఆ వందడుగులూ ఎక్కేసరికి అలవాటులేని ఆయనకి ఆయాసం వచ్చింది. పి.ఓ- గార్డు- రేంజరు- మల్లూ- ఆర్డర్లీ వాడి చుట్టూ చేరారు.

''సూసినావ్ దొరా! దాని గురుతిలియే. మన్నుం దీడ. గురుతులడ్డాయి. అది కొండమీనుంది. రా దొరా- అదే దిక్కుపోయిందో నేసూపుతా,'' అంటూ కొండ పైకి పరుగుతీశాడు దుబ్బుదొర.

''అలా కాదులే. కాస్సేపట్లో చీకటి పడుతుంది. రేప్పొద్దునే కొండెక్కుదాం- రా గూడానికి పోదాం,'' అంటూ గట్టిగా కేక పెట్టాడు పి.ఓ.

''దొర సెప్పేదినలేదా గుడ్డెదవా. ఏటా నగెత్తడం ముగాన్ని నువ్వే సంపేటట్టు. దిగు, దిగు,'' అని మల్లు దొర మరో కేక పెట్టాడు.

దుబ్బుదొరకి చాలా నిరుత్సాహం కలిగింది. 'మల్లీ రేపేటి. ఈ సిటంలో సేసే పనికి వోయిదాలేటి. దాన్ని మాపటికెట్టా సేత్తారు. పెద్దోల్ల సబబిట్టాగుంటది,' అనుకుంటూ అయిష్టంగా కిందికి దిగాడు. అందరూ గూడెం చేరేసరికి సూర్యాస్తమయమయింది.

పి.ఓ గారు భోజనం చేశాక రాత్రి డేరా ముందర అందరూ సమావేశమయ్యారు.

''దుబ్బుదొర చూపిన గుర్తుల వల్ల పులి కొండ మీదుంది అన్నది మనకి స్పష్టంగా తెలిసింది. రేపు సూర్యోదయం కాకుండా మనం కొండెక్కుదాం. నా దగ్గరా రేంజరు దగ్గరా పిస్టల్స్ ఉన్నాయి. పోతే మనదగ్గర మూడు తుపాకులు ఉన్నాయి. ఒకటి గార్డు, రెండవది ఆర్డర్లీ. మీలో ఎవరయినా తుపాకీ కాల్చగలరా,'' అడిగాడు పి.ఓ.

''నాకొస్తది దొరా,'' అన్నాడు మల్లు. అన్నాడే కానీ తుపాకీ చేతపట్టి తను రెండు దశాబ్దాలు దాటిందని అతనికి తెలుసు.

''రైట్. మేం అయిదుగురం కొండెక్కుతాం.''

''ఏటి దొరా! అదేటి సబబు. మా కాడ బందూకు నేదు. మా బల్లాలూ, బరిసెలు సాన- ఎనకో పది మందొస్తాం,'' అన్నాడు కొండదొర.

''అవ్ దొరా! మనకీ మంది బలముంటుంది,'' అన్నాడు మల్లు తన చేతిలో తుపాకీకి ఎంత ఉపయోగం ఉంటుందో తెలిసి. తను కూడా వస్తానని దుబ్బుదొర పదేపదే మొత్తుకున్నాడు. కాని ఎవరూ వినలేదు.

''పెద్దలం మేముండగా పసివాడివి నువ్వెందుకు పులివేటకి. వేటకాగానే పులిని చూపినందుకు నీకు మంచి బహుమానమిస్తా,'' అన్నాడు పి.ఓ.

వేకువజామునే కొండెక్కడానికి తీర్మానమయింది. దుబ్బుదొరకి చాలా నిరాశ కలిగింది. తను దారి చూపుతానన్నా ఎవరూ వినలేదు. తను గూడెంలోని పెట్టలతో కింద నుండాలా! చూపులేని వాడి కళ్ల నిండా నీళ్లు తిరిగాయి.

రాత్రి వాడికి నిద్రపట్టలేదు. వాడిని పులి ఆవహించింది. దాని వోసనెట్టా ఉంటది? గాండ్రు మంటుందట. ఆ శబ్దం తను వినలేదు. గుడిసెలో అందరూ గురక పెడుతున్నారు. తల పంకించి ఒక నిర్ణయానికి వచ్చాడు.

మెల్లగా లేచాడు. చప్పుడు కాకుండా చూరులోని చిరుకత్తి తీశాడు. కంచె దాటి బండ మీద సానపెట్టాడు. మళ్లీ గుడిసెలోకెళ్లి చూరుకి వేలాడగట్టిన ఒక కర్ర భరిణెను వెదికి తెచ్చాడు. కంచెదాటి బండ చేరాడు. భరిణమూత తీసి దానిలోని ద్రవాన్ని చుక్కచుక్కగా కత్తికి రాయడం మొదలుపెట్టాడు. ఆ ద్రవం కాలకూట విషం. అమ్ముని దానిలో ముంచి బాణం వేస్తారు ఆటవికులు. దానిలోని ఒక చుక్కలో చిన్నభాగం చాలు నిండు ప్రాణాలు వెంటనే తియ్యడానికి. విషం పుయ్యడం పూర్తి కాగానే కత్తిని పిడితో పట్టుకున్నాడు. విషం గాలిలో ఆరి కత్తికి అతుక్కుంటుంది.

చల్లటి రాత్రి గాలి. దూరాన అడపాదడపా నక్కల కూతలు- కీచురాళ్ల రొద. దూరంగా వేసిన నెగడులోని దుంగలు టపటపమంటున్నాయి మధ్యలో. గూడెం మొత్తం నిద్రలో ఉంది. ఆకాశం కేసి చూశాడు. రాత్రి రెండో జాము దాటింది. కత్తికి గుడ్డ చుట్టి మొలలో పెట్టుకున్నాడు. పొరపాటున శరీరానికి కత్తి తగిలి చిన్న చీరికయినా చావు ఖాయమని వాడికి తెలుసు. ముల్లు కర్రందుకుని నడవసాగాడు దొర డేరా వైపు.

'దొర తొంగునుంటాడు. ఆరి కాల్లట్టుకోవాల. దొరా నేనూ వత్తా- నన్ను రానీ అని మొక్కాల.'

నిశ్శబ్దంగా నడుస్తున్న దుబ్బుదొర ఠక్కున ఆగి పోయాడు. అంతవరకూ వాడికి తెలియని వాసన వాడి ముక్కుని చేరుకుంది- గబ్బు వాసన. వాడికి ముప్ఫయి అంగల దూరం నుంచి వస్తూంది. అడుగులో అడుగేసు కుంటూ ఆ గబ్బువాసన వచ్చిన దిక్కుకి నాలుగంగలు వేశాడు. ఆ వాసన చాలా వెగటుగా ఉంది. వంగి నేలపై చెవి పెట్టి వినసాగాడు. ఏ కదలికాలేదు. గూడెంలోనే కాదు- చుట్టుప్రక్కల కూడా. దూరాన గడ్డి మీద ఏదో కదలిన చప్పుడు. చెవులు రిక్కించి వినసాగాడు. దూరంగా ఏదో నిశ్శబ్దంగా కదులుతూంది. గబ్బువాసన ఎక్కువైంది. ఏ కంచెలోని మేకపిల్లో గట్టిగా మే...మే అని అరవసాగింది. నిద్దట్లో లేచిన ఓ కుక్క భౌ... భౌ అంది. కదలిక ఆగిపోయింది. మళ్లీ కాసేపు నిశ్శబ్దం. కొంచెంసేపట్లో మళ్లీ కదలిక. తుళ్లిపడి లేచాడు దుబ్బు దొర.

'ఇదే ఆ ముగం- మగమ్మారి- కొండ దిగినావా- గూడేనికొచ్చీసావా- ఈ రేత్రి యారిని మింగుతావో- దొరకాడికి నగెత్తాల... నడుంలో ఉందే ఈ ముగం,' ఆలోచనలతో సతమతమవుతూ అక్కడున్న మద్దిచెట్టు వెనక్కి చేరాడు.

వాడి చెవులు, ముక్కు చాలా నిశితంగా ఎదురు చూస్తున్నాయి. రాబోయే ఆపద కోసం. వాడి లేత గుండె దడదడ కొట్టుకుంటంది. అంత మన్నెం చలిగాలిలో కూడా వాడి ముఖం మీద చెమట పోసింది.

'స- స- ఏటిది- నాను పుంజుని- పెట్టలా ఏటేటీ వణుకు. రానీ ముగాన్ని- తన్నేటి సేత్తది- రేపటికి కావా లని కత్తి ముందుగా తీసుకుని ఇసం కూడా పూశా. మంచి గోచన- ఒక్క పోటు- ముగం కత ముగిసిపోద్ది.'

వస్తున్న అడుగులు ఆరు అంగల దూరంలో వున్నాయి- గబ్బువాసనకి ముక్కుపుటాలు బద్దలవు తున్నాయి.

'రాయే- నీ పాలి కాలుడ్ని- దొర నేదు- బందూకు నేదు- నీ సావు నా సేతిలో రాశాడు బ్రమ్మ.'

మొలలోన కత్తిని జాగ్రత్తగా పైకి తీసి దానికి చుట్టిన గుడ్డని మెల్లగా తీసేశాడు. పిడిని పిడికిలిలో బలంగా పట్టుకున్నాడు నరనరాల్లోని శక్తినంతటినీ కూడదీసుకుని.

'ఏటది!... ఎనక్కి పోతాంది... అయ్యో... ఎనక్కి... ఆ౯... ఆ౯... ఆగింది... తిరిగింది. ఆ అదో నగెత్తుతూంది మెల్లగా. రొద నేకుండా.'

చెట్టు మొదలుని అతుక్కుంటూ ఎదురు చూస్తు న్నాడు దుబ్బుదొర రిక్కించిన చెవులతో. హడావిడిలో వాడి కాలి కింద ఎండుటాకు నలిగి రవంత శబ్దమ యింది. సన్నని పరుగుతో ముందు కొస్తున్న పులి ఆ చిన్న శబ్దానికే ఆగిపోయింది. తోక బిగుసుకుని లేచి నుంచుంది. ముందరి పంజాతో భూమిని తవ్వుతూంది.

'ఏటి... బేపిలా మన్ను తవ్వుతావ్- నీ గొయ్య నువ్వే తవ్వుతావ్?'

తలపైకి పెట్టాడు చెట్టు చాటు నుంచి వాడికి తెలుసు పులికీ తనకీ మూడంగల దూరం కూడా లేదు. చింతనిప్పుల్లా భగ్గుమంటున్న పులి కళ్లకి కనిపించింది వాడి కళ్లు పోయిన తల.

గుర్రుమంది పులి. కంచెలోని మేకలు హృదయ విదారకంగా అరిచాయి. కేవలం ఆ గుర్రుకే వాడి రక్త స్రావం మెరుపు వేగాన్నందుకుంది. ఈ చెట్టుచాటు నుంచి బయటకు రాగానే అది తన మీకి దూకుతుంది. ఎంటనే పొడవాలి- ఏగంగా- బలంగా- ఈ సాటు బయలకు తను పడితే గాని అది తన మీకి దూకదు- అది దూకపోతే దాన్ని పొడవలేడు. కత్తి బలంగా పట్టుకుని చెట్టు చాటు నుంచి బయటకొచ్చాడు.

దానికోసమే ఎదురుచూస్తున్న పులి వాడి మీదకి దూకింది- అందుకే చూస్తున్నాడు తను కూడా- వాడి చిరుకత్తి దాని పొట్టలోకి దిగింది. దెబ్బతిన్న పులి గాండ్రు మంది. దాని గర్జనకి గూడెమంతా మేల్కొంది. పులి పంజాతో వాడి మెడ మీద కొడుతూంటే మరో కత్తి పోటు- పులి గుండెల్లోకి- దద్దరిల్లిపోయే గాండ్రింపులు. గూడెం మొత్తం, డేరాలోని దొర, పరివారం పరుగున చేరారక్కడికి.

నెత్తురు మడుగులో కొట్టుకుంటుంది పులి- పక్కనే సగం విరిగిన మెడతో చావుతో ఆఖరి పోరాటం చేస్తున్న దుబ్బుదొర. పి.ఓ పరుగున దగ్గరికి చేరాడు. ఆఖరి క్షణాల్లో కూడా ఆయన పాదాల సవ్వడి దుబ్బు దొరకి గుర్తే.

"దొరా... ము...గం... సం...పే...సినా," అంటూ కళ్లు మూశాడా కబోది.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 19 అక్టోబరు 2003*